పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# 90. అల్ బలద్ సూరా పరిచయం

మక్కాలో అవతరించబడింది. ఇందులో 20 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

ఈ సూరా మక్కాలో అవతరించింది. తిరస్కారులు మహాప్రవక్త (స)కు విరోధులయిపోయారు. ఆయన (స)కు వ్యతిరేకంగా అన్ని రకాల దౌర్జన్యం చేయసాగారు. ఆ సమయంలో మక్కాలో ఈ సూరా అవతరించింది. హింసా దౌర్జన్యాల పర్యవసానం చెడుగా ఉంటుందని, మానవుల పట్ల ప్రేమానురాగాలతో మెలగాలని అల్లాహ్ హితవు పలికాడు.

ఈ సూరాలో మనిషి శ్రమపడటానికి పుట్టించబడ్డాడు. మానవుడు తల్లి గర్భం నుండి జన్మించేటప్పుడు బాధతో యాతనతో పుట్టాడు. అందువల్ల ఏడుస్తూ పుడతాడు. నడవటానికి యోగ్యుడయినప్పుడు పడుతూ లేస్తూ నడవగలిగాడు. పెద్దవాడయ్యాక గురువు గారి దెబ్బలు మరో వైపు తల్లిదండ్రుల గద్దింపులు, పెళ్ళయ్యాక భార్యాబిడ్డల బాధ్యతల భారం ఇలా జీవితం అంతా శ్రమ కష్టపడి కొనసాగించడంలోనే గడిచిపోతుంది. పరలోక విజయ మార్గం కూడ శ్రమ యాతనతో కూడిన మార్గమే. అది కేవలం నోటితో ఒప్పుకోవడం మాత్రమే కాక ఆచరణామార్గం. స్వర్గం ఒక కష్టతర మార్గం. దాటిన తర్వాత లభిస్తుంది. మనకూ స్వర్గానికీ మధ్య ఒక ఇరుకయిన పర్వతమార్గం ఉంది. మనం గనక ఆ ఇరుకయిన పర్వత మార్గాన్ని దాటగలిగితే స్వర్గానికి చేరుకోగలం. మనం గనక ఆ మార్గాన్ని దాటకపోతే, కష్టాలు, ఇబ్బందుల కారణంగా మానుకుంటే స్వర్గంలో ఎంతమాత్రం ప్రవేశించలేము. స్వర్గంలో చేరడానికి కష్టాల మార్గం దాటడం అవసరం. ఆ కష్టతర మార్గం ఇరుకయిన పర్వతమార్గం. వాస్తవానికి పేద మానవులకు సహాయం చేయడం అనాథలు, దిక్కులేని వారిపై కనికరం చూపడం. అల్లాహ్ మనకు సంపదనిస్తే మనమూ తినాలి. పేదలూ అనాథలకూ సహాయం చెయ్యాలి. ప్రత్యేకించి కరువు కాటకాల కాలంలో దుర్భర దారిద్ర్య కాలంలో మన దగ్గర ఒకే ఒక రొట్టె ఉంటే, అది మనకే చాలనప్పటికీ మన తిండిలో తగ్గించుకుని అనాథలు, దిక్కులేని వారికి అగత్యపరులకు సహాయం చెయ్యాలి. ఇది ఒక కష్టమయిన పని. మన మనస్సు సహాయం చెయ్యడానికి సిద్ధంగా లేదు. కాని మన విశ్వాసం మనల్ని ఒత్తిడి చేస్తుంది. స్వర్గంలోకి వెళ్ళడానికి, పంచి తినడం పేదలు, అనాథలకు సహాయం చెయ్యటం ఎంతో అవసరం.

# 90. అల్ బలద్

**ఆయత్‌లు : 20** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన
అల్లాహ్ పేరుతో

(1) లేదు. ఈ నగరం (మక్కా) తోడుగా! (2) ఇంకా (ఓ ముహమ్మద్ –స) నీవు ఈ నగరవాసివి.
(3) ఇంకా తండ్రి మరియు అతడి సంతానం తోడు!
(4) మేము మానవుడిని ఎంతో యాతనలో పుట్టించాము. (అంటే మానవ జీవితం శ్రమ యాతనలతో కూడి ఉంది). (5) అతడిపై ఎవరి ఆధిపత్యమూ చెల్లదని అతడు భావిస్తున్నాడా?
(6) ఎంతో ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చుచేశాను అని అంటున్నాడు. (7) తనను ఎవరూ చూడలేదని అతడు భావిస్తున్నాడా? (8) అతనికి మేము రెండు కళ్ళను ఇవ్వలేదా? (9) ఇంకా నాలుకా, రెండు పెదవులు (ఇచ్చాము). (10) మేమతనికి రెండు మార్గాలను చూపాము. (పాపం, పుణ్యాల మార్గం).
(11) కాని అతడు కఠినమైన కనుమను దాటలేదు.
(12) ఆ కఠినమైన కనుమ అంటే నీవు ఏమని అనుకున్నావు? (13) బానిసను విముక్తుణ్ణి చేయడం
(14) లేక పస్తువున్న రోజున భోజనం పెట్టడం.
(15) బంధువు లేక అనాథకు (16) నిరాశ్రయుడు లేక దిక్కులేని వారికి (17) మరి విశ్వసించి, ఒకరినొకరు సహనం వహించమని, దయ చూపమని ప్రోత్సహించే, తాకీదు చేస్తూ ఉండే వారిలో చేరిపోయే వారు.
(18) వీరే కుడిపక్షం వారు. (19) ఇంకా మా ఆయత్‌లను తిరస్కరించినవారు దౌర్భాగ్యులు.
(20) వారిపై నరకాగ్ని ఆవరించి ఉంటుంది.

آياتها 20 — سورة البلد 90 مكية — ركوعها 1

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

لَآ اُقْسِمُ بِهٰذَا الْبَلَدِۙ ﴿1﴾
وَاَنْتَ حِلٌّۢ بِهٰذَا الْبَلَدِۙ ﴿2﴾ وَوَالِدٍ وَّمَا وَلَدَۙ ﴿3﴾
لَقَدْ خَلَقْنَا الْاِنْسَانَ فِيْ كَبَدٍؕ ﴿4﴾
اَيَحْسَبُ اَنْ لَّنْ يَّقْدِرَ عَلَيْهِ اَحَدٌ ۘ﴿5﴾
يَقُوْلُ اَهْلَكْتُ مَالًا لُّبَدًاؕ ﴿6﴾
اَيَحْسَبُ اَنْ لَّمْ يَرَهٗۤ اَحَدٌؕ ﴿7﴾
اَلَمْ نَجْعَلْ لَّهٗ عَيْنَيْنِۙ ﴿8﴾ وَلِسَانًا وَّشَفَتَيْنِۙ ﴿9﴾
وَهَدَيْنٰهُ النَّجْدَيْنِۚ ﴿10﴾
فَلَا اقْتَحَمَ الْعَقَبَةَ ۖ﴿11﴾
وَمَاۤ اَدْرٰىكَ مَا الْعَقَبَةُؕ ﴿12﴾ فَكُّ رَقَبَةٍۙ ﴿13﴾
اَوْ اِطْعٰمٌ فِيْ يَوْمٍ ذِيْ مَسْغَبَةٍۙ ﴿14﴾
يَّتِيْمًا ذَا مَقْرَبَةٍۙ ﴿15﴾
اَوْ مِسْكِيْنًا ذَا مَتْرَبَةٍؕ ﴿16﴾
ثُمَّ كَانَ مِنَ الَّذِيْنَ اٰمَنُوْا وَتَوَاصَوْا بِالصَّبْرِ
وَتَوَاصَوْا بِالْمَرْحَمَةِؕ ﴿17﴾
اُولٰٓئِكَ اَصْحٰبُ الْمَيْمَنَةِؕ ﴿18﴾
وَالَّذِيْنَ كَفَرُوْا بِاٰيٰتِنَا هُمْ اَصْحٰبُ الْمَشْئَمَةِؕ ﴿19﴾
عَلَيْهِمْ نَارٌ مُّؤْصَدَةٌ ۧ﴿20﴾ ع 1 20 15

1 – 4 వాక్యాలు

ఈ చిన్న సూరాలో చిన్న చిన్న వాక్యాలలో ఒక పెద్ద అంశాన్ని ఎంతో ప్రభావపూరితంగా వివరించడం జరిగింది. మానవుడికి విజయం, అపజయాల రెండు మార్గాలు చూపాడని తెలుపడం వాటిని చూడటానికి, వాటిపై నడవడానికి ఏర్పాట్లు కూడా చేయబడ్డాయి. ఇక ఇది మానవుడి స్వీయ ప్రయత్నం శ్రమపై ఆధారపడి ఉంది. అతడు

https://teluguislam.net/quran/

పుణ్యమార్గంలో నడిచి, అతని పర్యవసానం మంచిదయ్యేలా చేసుకుంటాడా లేక పాప మార్గం అవలంబించి దుష్పరిణామానికి అర్హుడవుతాడా? అనేది అతడే ఆలోచించుకోవాలి.

మొట్టమొదట మక్కా నగరం. అందులో ముహమ్మద్ (స)పై జరుగుతున్న దౌర్జన్యాలు ఇంకా పూర్తి ఆదం సంతతి పరిస్థితిని, ఈ వాస్తవానికి సాక్షిగా పేర్కొనడం జరిగింది. ఈ ప్రపంచం మనిషికి విశ్రాంతి నిలయం కాదు. అందులో అతడు సుఖాలు అనుభవించడానికి పుట్టించబడలేదు. పైగా అతడి పుట్టుకే ఇక్కడ శ్రమపడుతున్న స్థితిలో జరిగింది. మనిషి ఈ ప్రపంచంలో భోగభాగ్యాలు అనుభవించడానికోసం పుట్టించబడలేదు. పైగా ఈ ప్రపంచం మనిషికి కష్టాలు ఎదుర్కొనే కఠిన పరిశ్రమ చేయవలసిన స్థలం. ఏ మనిషి అయినా ఈ దశను దాటకుండా ఉండలేడు. ఈ మక్కా నగరం సాక్షిగా ఉంది. ఇక్కడ హజ్రత్ ఇబ్రాహీం, హజ్రత్ ఇస్మాయీల్ ఎంత ప్రయాసపడ్డారు!? ఇంకా హజ్రత్ ముహమ్మద్ (స) మక్కా నగరాన్ని షిర్క్ మరియు పాపాల నుండి పవిత్రవంతం చెయ్యడానికి ఎటువంటి కఠోర శ్రమ పడుతున్నారో అందుకు ఈ నగరమే సాక్షి!

5 – 19 వాక్యాలు

ఈ ఆయత్‌లలో అల్లాహ్ సెలవిస్తున్నాడు. మేము మానవుడికి విజ్ఞాన మార్గాలు, ఆలోచించే, అర్థం చేసుకునే యోగ్యతలు ఇచ్చి, అతడి ఎదుట మేలు, కీడు రెండింటి మార్గాన్ని విడమరచి ఉంచాము. ఒక మార్గం నైతిక పతన దశలవైపు పోతుంది. ఈ మార్గం సులభమయినది. ఈ మార్గంపై నడవడంలో ఎటువంటి కష్టమూ ఉండదు. పైగా మనసుకు (స్వయానికి) అమిత మాధుర్యం కలుగుతుంది.

రెండో మార్గం నైతికత యొక్క ఔన్నత్యం వైపు వెళుతుంది. అది దాటడానికి కష్టతరమైన కనుమ లాంటిది. దానిపై నడవాలంటే మనిషికి తన ఆత్మను నిగ్రహించుకోవలసి ఉంటుంది. తన కోరికల్ని విడిచిపెట్టవలసి వస్తుంది.

ఈ మానవుడి బలహీనత ఏమంటే అతడు ఈ కనుమను ఎక్కిపోవడం కన్నా, గోతిలో పడడానికి ఎక్కువ ఇష్టపడతాడు. తర్వాత దానిపైకి ఎక్కి మనిషి ఎత్తులకు పోగలగటానికి పనికివచ్చే ఆ కనుమ ఏదో అల్లాహ్ చూపించాడు. ఆ మార్గం, మనిషి ప్రదర్శన కోసం, అహంకారం, గర్వం కోసం ఖర్చుచేసే బదులు తన సొమ్మును అనాథలు, దిక్కులేని వారి సహాయం కోసం ఖర్చు చేయడం. విశ్వాసులతో కలసి, పరస్పరం సహనం వహించడం ధర్మ పరాయణత కోరే కోరికలను పూర్తి చేయటం, అతడు దైవదాసులపై కనికరం చూపే వాడవ్వాలి. ఈ మార్గాన నడిచేవారి పర్యవసానం, మనిషి దైవ కారుణ్యాలకు అర్హుడు కాగలగడం. దైవప్రవక్త (స) సెలవిచ్చారు – "దైవదాసులపై కనికరం చూపేవారిపై దైవం కనికరం చూపుతాడు. మీరు భూవాసులపై కరుణ చూపండి. ఆకాశం లోనివాడు మీపై కరుణిస్తాడు." (తఫ్సీర్ ఇబ్నె కసీర్) దైవప్రవక్త (స) సెలవిచ్చారు, "చిన్నవారిపై కరుణించని వాడు, పెద్దల హక్కును చెల్లించని వాడు మాలోని వాడు కాదు" అంటే అతడు మా విధానంపై లేడు. ఇంకా పుణ్యం, అభిమానం మానవత్వ సంక్షేమ మార్గాన్ని వదలి పాపమార్గాన్ని అవలంబించే వారికి నరకాగ్ని ఉంది. దాని నుండి బయటికి వచ్చే మార్గాలన్నీ మూసుకుపోయాయి.

మహనీయ ముహమ్మద్ (స) ఉపదేశించారు : "ఇతరులపై దయచూపని వాడిపై అల్లాహ్ కూడా దయచూపడు." (సహీహ్ బుఖారీ – హ.నెం. 6828)